## రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

మోతీనగర్: మోతీనగర్‌లోని శారద శృంగేరి శంకర మఠం ఆవరణలో సోమవారం సువర్ణ భారతి మహోత్సవంలో భాగంగా సాధూరాం కంటి ఆసుపత్రి, శృంగేరి శారద శంకర మఠం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శంకరమఠం ధర్మాధికారి సీఎస్‌ఆర్ మూర్తి శనివారం తెలిపారు. శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు, మందులు, కళ్లజోళ్లు, ఆపరేషన్లు అవసరమైన వారికి చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మోతీనగర్ పరిసర ప్రాంత వాసులు వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

## ఏబీవీపీ కమిటీ ఎన్నిక



కేపీహెచ్‌బీకాలనీ: ఏబీవీపీ జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీ అధ్యక్షుడిగా శ్రీరామ్ నాయక్, కార్యదర్శిగా శివమణిని శనివారం రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంపస్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు సంజయనీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ శనివారం వైభవంగా జరిగింది. 18 కళశాల మహా పడి పూజ కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి పాల్గొన్నారు. అయ్యప్ప పాటలతో అలరించారు. కార్యక్రమంలో సందీప్ గురుస్వామి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రికి మహర్దశ

**220 పడకలకు మల్కాజిగిరి ఆసుపత్రి అప్‌గ్రేడ్**

- మెడికల్ కాలేజీకి అనుబంధంగా వసతులు
- డయాగ్నస్టిక్ హబ్, రేడియాలజీ ల్యాబ్





మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

సాక్షి,సిటీబ్యూరో: మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి మంచిరోజులు వస్తున్నట్లు కనిపిస్తోంది. ఈసీఐఎల్‌లోని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిని మార్చడంతో మహర్దశ కలిగినట్లైంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరింతగా పెరగనున్నాయి.

**వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి..**

ప్రభుత్వ ఆదేశాల మేరకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ ఆసుపత్రిలో పడకల సంఖ్యను పెంచడంతో పాటు దానికి తగ్గట్టుగా అన్నీ వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మల్కాజిగిరి ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలో ప్రస్తుతం 70 పడకలు ఉండగా.. ఆ సంఖ్యను 220 పడకలకు పెంచారు.

**అదనపు సిబ్బంది నియామకం..**

మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన పడకల సంఖ్యకు అనుగుణంగా ఇప్పటికే 94 మంది డాక్టర్లను నియమించారు. ఇందులో మెడికల్ కాలేజీకి సంబంధించిన డాక్టర్లు 49 మంది ఉండగా.. వైద్యారోగ్యశాఖ డాక్టర్లు 45 మంది ఉన్నారు. దీనికి తగ్గట్టుగా స్టాఫ్ నర్సులను కూడా నియమించేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల సంఖ్య 30 ఉండగా.. ఆ సంఖ్యను 100కు పైగా పెంచేందుకు వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తోంది.

**ప్రజలకు అందుబాటులో మరిన్ని సేవలు..**

ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అనాటమీ, బయోకెమిస్ట్రీ, పిజీయాలజీ, సైకాలజీ ,పాథాలజీ, మైక్రోబయాలజీ, గైనకాలజీ , పిడియాట్రీక్స్, జనరల్ సర్జన్, మెడిసిన్, సైకాలజీ, అర్థోపెటిక్, ఈఎన్టీ, అప్తమాలజీ, రేడియాలజీ డిపార్ట్‌మెంట్లు ఉండటంతో దీనికి సంబంధించిన విభాగాలు మల్కాజిగిరి జనరల్ ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటుకానుండటంతో ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందనున్నాయి.

**అదనపు పరికరాలతో పెరగనున్న వసతులు..**

డయాగ్నస్టిక్‌హబ్‌తో పాటు రేడియాలజీకి సంబంధించిన విభాగాలు కూడా త్వరలో ఆసుపత్రికి రానున్నాయి. మరో రెండేళ్లలో మల్కాజిగిరి ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ల సంఖ్యతో పాటు వైద్యసేవల పరంగా మరిన్ని వసతులు ఏర్పడే అవకాశం ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అవసరమైన సదుపాయాలతో పాటు కావాల్సిన పరికరాలు, పారామెడికల్, వైద్య సిబ్బంది సంఖ్య కూడా పెంచనున్నారు.

**అల్వాల్ సూపర్ స్పెషల్ ఆసుపత్రితో..**

నియోజకవర్గ పరిధిలోని అల్వాల్‌లో నిర్మిస్తున్న టీమ్స్ (సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వాసుపత్రి) పూర్తైతే మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రజలకు సముచిత స్థాయిలో వైద్యసేవలు అందించగలమని, ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

**మూడు సీహెచ్‌సీలు..**

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఘట్కేసర్, మేడ్చల్, శామీర్‌పేట్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లు, 28 యూపీహెచ్‌పీసీలు, 12 పీహెచ్‌పీలు, 112 బస్తీ దవాఖానాలు, 69 పల్లె దవాఖానాలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కీసర, జవహర్‌నగర్, అల్వాల్, బాలానగర్, మల్లాపూర్, షాపూర్‌నగర్‌లోని ఆరోగ్యకేంద్రాల్లో ప్రజలకు 24 గంటల వైద్యసేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటుంది.

- నారపల్లి ,కుషాయిగూడ, ఎంసీపల్లి, కుత్బుల్లాపూర్, దుండిగల్, పర్వతానగర్, వెంకట్‌రెడ్డినగర్ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గర్భిణులకు ప్రసవాలను నిర్వహిస్తున్నట్లు వైద్యశాఖ తెలిపింది.
- ఈసీఐఎల్‌లో మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేశారు. జిల్లాలో కొనసాగుతున్న బస్తీ,పల్లె దవాఖానాలు, సీహెచ్‌పీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్యశాఖ సేవలందిస్తోంది.



**ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన వైద్యసేవలు**

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికే ప్రైవేట్‌రంగంలో 7 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఈసీఐఎల్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరింత పెరిగే అవకాశం ఉంది.
– డా. రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్‌ఓ

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురికి రూ.2.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను శనివారం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ లబ్ధిదారులకు అందజేశారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



కాలనీలో పర్యటిస్తున్న విద్యాకల్పన

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన అన్నారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు శనివారం రిక్షాపుల్లర్స్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల డ్రైనేజీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గణేష్ గౌడ్, అశోక్, జితేందర్, దయాకర్‌రెడ్డి, సంపంగి యాదగిరి, శాలిని, నాగమణి పాల్గొన్నారు.

## విద్యుత్ మరమ్మతు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్‌లో శనివారం కార్పొరేటర్ సబిహా బేగం విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్‌ఐఏ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే వివేకానంద నగర్ ఫీడర్, అయ్యప్ప సొసైటీ సబ్ స్టేషన్ నుంచి వచ్చే పర్వత్‌నగర్ ఫీడర్‌లను కలుపుకుంటు 16 పోల్స్‌తో అనుసంధానమైన లైన్ వేయడం జరుగుతుందన్నారు.

## హామీల అమలుకు ప్రభుత్వం కృషి



కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత, పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి

- ఏడాది పాలనలోనే అనేక పథకాలు అమలు
- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత

కూకట్‌పల్లి: ఏడాది పాలనలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, మిగిలిన హామీల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ బీ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బాలాజీనగర్, కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రజాపాలన విజయోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందన్నారు. అందుకే ఆ పార్టీని ప్రజలు ఓడించారని గుర్తు చేశారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు బురద జల్లే రాజకీయాలు మానుకోవాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, వివిధ డివిజన్‌ల అధ్యక్షులు కృష్ణరాజ్, తమ్మినేని ప్రవీణ్, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సాధు ప్రతాప్ రెడ్డి, విఠల్ రెడ్డి, రాఘవేందర్, నాగరాజు, రమాదేవి, సంధ్య, మారుతి, జోజమ్మ, రజిత, భారతమ్మ, రేష్మ, కృష్ణవేణి, బొలిశెట్టి శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన బాలోత్సవ్

గచ్చిబౌలి: సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలిలో రెండ్రోజులపాటు నిర్వహించిన బాలోత్సవ్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎన్‌ఐటీ విశ్రాంత ప్రొఫెసర్ కె రాంచంద్రయ్య, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి ప్రభాకర్, శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య ఆధ్వర్యంలో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో కేంద్రం ట్రస్ట్ సభ్యుడు ఆర్ సాంబశివరావు, బాలోత్సవ కన్వీనర్ విజయ్ కుమార్, రవీందర్, అనిల్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ఆల్విన్‌కాలనీ: ఇంద్రహిల్స్ జెరూసలేం ప్రార్థన మందిరం రెవరెండ్ ఎం. రాజు చర్చిలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు పాస్టర్లకు కానుకగా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో రాములుగౌడ్, సాయిగౌడ్, చంద్రశేఖర్ గౌడ్, బాలస్వామి, అజయ్, నవీన్, తుని, పాస్టర్ సైలెస్, సామిల్, దేవదాస్, గోపి, నాగభూషణం, నాగేశ్వరరావు, కోకిల, నతానిల్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో లియోషా విజయం



దుండిగల్: దుండిగల్ మున్సిపల్ బౌరంపేట్‌కు చెందిన కోరుకొండ లియోషా జాతీయ బ్యాట్మింటన్ పోటీల్లో విజయం సాధించింది. మహారాష్ట్రలోని థానేలో జరిగిన మూడో మినీ( అండర్–11) జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో కోరుకొండ లియోషా గోల్డ్ మెడల్స్ గెలుచుకొని సత్తా చాటింది. లియోషా భౌరంపేట్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్(డీపీఎస్)లో గ్రేడ్-4 చదువుతోంది.

## దోమల నివారణకు చర్యలు



పిచికారీ చేయిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ అన్నారు. శనివారం ఎంటమాలజీ సిబ్బందితో దోమల నివారణ కోసం పరికి చెరువులో డ్రోన్ యంత్రం సహాయంతో రసాయనాలను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ వంతు బాధ్యతగా ఇంటి పరసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. చెత్తను వీధుల్లో, కాలువల్లో, చెరువుల్లో వేయకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాండుగౌడ్, గుడ్ల శ్రీనివాస్, కరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎస్‌ఎం పాఠశాలలో అష్టావధానం



మూసాపేట: కూకట్‌పల్లి పీఎస్‌ఎం స్కూల్ ప్రాంగణంలోని ఇందిరా చంద్రశేఖర్ ఆడిటోరియంలో శనివారం వివేకానంద సేవా సమితి, భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్, అవధాన విద్యా వికాస పరిషత్ ఆధ్వర్యంలో అష్టావధానం నిర్వహించారు. కార్యక్రమానికి ఖరగ్‌పూర్ ఐఐటీ బీటెక్ విద్యార్థి, యువ అవధాని కిషోరం నల్లాన్ చక్రవర్తుల సాహిత్, వివేకానంద సేవా సమితి చైర్మన్ సీహెచ్. హనుమంతరావు, అశ్విని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అష్టావధానం తెలుగు భాషల్లోనే ఉందని, దాని గొప్పతనాన్ని, విధానాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు పద్యాలు జీవన విధానాన్ని తెలియజేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో అష్టావధానులు చింతా రామకృష్ణారావు, ముద్దు రాజయ్య, కటకం వెంకటరామ, సంగనభట్ల నరసయ్య, శ్రీధర్‌రావు, సోమయాజులు భాను ప్రకాష్, పంచశీల స్కూల్ చైర్మన్ శ్రీనివాస్, ఆర్ఆర్ స్కూల్ కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఖోఖో పురుషుల జట్టు ఎంపిక



జట్టు ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో ఖోఖో పురుషుల జట్టును శనివారం ఎంపిక చేశారు. యూనివర్సిటీ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో సెలక్షన్‌ను నిర్వహించారు. డిసెంబర్ 27 నుంచి 31వ తేదీ వరకు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడులో జరిగే ఖోఖో ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో జేఎన్‌టీయూ జట్టు పాల్గొననున్నట్లు తెలిపారు. వివిధ కళాశాలల నుంచి 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో దేశ రాజ్యాంగం: సీపీఎం





ర్యాలీలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర నాయకులు

నిజాంపేట్: భారత రాజ్యాంగం పెనుప్రమాదంలో ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నరసింహారావు అన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సీపీఎం మూడో మహాసభలు శనివారం ప్రగతినగర్‌లోని లీలా సుందరయ్య ఫంక్షన్‌హాల్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఇటీవల మరణించిన ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పలువురు నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న దారిద్ర్యం, ఆర్థిక సంక్షోభానికి పెట్టుబడిదారి విధానాలు పరిష్కారం చూపలేకపోతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకుడు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఒకవైపు ఆకలితో పేదలు అల్లాడుతుంటే, మరోవైపు సంపన్నులు పెరిగిపోతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులపై దాడులకు పాల్పడుతోందని, రైతు వ్యతిరేక చట్టాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప ఒక్క హామీ కూడా సరిగా నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి సత్యం, నాయకులు కోమటి రవి, చంద్రశేఖర్, అశోక్, వినోదం, కృష్ణారావు, వెంకట్రామయ్య, వరప్రసాద్, లక్ష్మణ్, రాజశేఖర్, రాథోడ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు పరికరాలు అందజేయాలి



దివ్యాంగులకు త్రీవీలర్ సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు



బియ్యాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కూకట్‌పల్లి: ప్రభుత్వం నుంచి దివ్యాంగులకు రావలసిన పరికరాలను అందజేయాలని, ఆ బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద బ్యాటరీ త్రీవీలర్ సైకిళ్లు, చేతి కర్రలు, వీల్ కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఎల్లవేళలా తమ సహకారం ఉంటుందని అన్నారు. గతంలో తన సొంత నిధులతో వందల మందికి ఉచితంగా మోటారు సైకిళ్లను అందించామని, రాబోయే రోజుల్లో మరి కొంత మందికి ఉచితంగా అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటస్వామి, కొన్ని నాగేశ్వరరావు, కిరణ్, చిరంజీవి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**90 క్వింటాళ్ల బియ్యం అందజేత**

కూకట్‌పల్లి: నిరుపేదలు, వృద్ధులు, అనాథలకు పీఎస్‌ఎం స్కూల్ యాజమాన్యం చేయూతనివ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శివానంద ఆశ్రమం, అమ్మానాన్న ఫౌండేషన్, వైదేహి ఫౌండేషన్‌లతో మరికొన్ని ఆశ్రమాలకు పీఎస్‌ఎం స్కూల్ ఆధ్వర్యంలో ఉచితంగా 90 క్వింటాళ్ల బియ్యాన్ని శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..స్కూల్ ఏర్పాటు నాటి నుంచి ప్రతి సంవత్సరం సామాజిక సేవలు చేయటంలో యాజమాన్యం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, చింతపట్ల హనుమంతరావు, అశ్విని సుబ్బారావు, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే శంకరయ్యపై చర్యలు తీసుకోవాలి**

కూకట్‌పల్లి: వెలమలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యపై చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎర్రబెల్లి సతీష్‌రావు, కంచనపల్లి నాగరాజు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి వెలమ నాయకులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌లకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే శంకరయ్య దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి కూకట్‌పల్లి ప్రధాన రహదారిపై దహనం చేశారు. అనంతరం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ములుగు ఆనందరావు, ఎర్రబెల్లి వాసుదేవరావు, ఉదయ్, సోమేశ్వరరావు, ప్రభాకర్‌రావు, రమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 108 కిలోల భస్మార్చన


ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని చైతన్య నగర్ నాగదేవత గుడిలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా 108 కిలోల భస్మార్చన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వివిధ పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు హాజరై పూజలు నిర్వహించారు. అదేవిధంగా కూకట్‌పల్లి బాగ్ అమీర్ నాగదేవత ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, అదేవిధంగా వివేకానందనగర్ డివిజన్ చైతన్య నగర్‌లోని నాగదేవత, సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంధ్య, శాలిని, నాగమణి, రసయ్య, బాలరాజు, నర్సింగ్‌రావు, అనిల్, మల్లేష్, పవన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



చైతన్య నగర్‌లో సుబ్రహ్మణ్య షష్ఠి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ రోజాదేవి తదితరులు



కేపీహెచ్‌బీ కాలనీలోని లులు మాల్‌లో శనివారం లులు బ్యూటీ ఫెస్ట్ 2024 నిర్వహించారు. ర్యాంప్‌పై మోడల్స్ క్యాట్‌వాక్‌తో ఆకట్టుకున్నారు. విక్కీ మానిక్, హేమంత్ శ్రీ డిజైనర్, ప్రకృతి కంభం ఫెమియా మిస్ ఇండియా తెలంగాణ, గటోకులు గణేశన్ మినిస్టర్ ఇండియా వరల్డ్ 2024 విన్నర్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. మోడల్స్ ఇండియన్, వెస్టర్న్ కేటగిరీల్లో పోటీ పడ్డారు. కార్యక్రమంలో లులు బ్యూటీ ఫెస్ట్ 2023 విజేతలు మౌనిక రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, తెలంగాణ రీజినల్ డైరెక్టర్ మహ్మద్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు. – మూసాపేట



భాగ్యనగర్ కాలనీలోని బచ్‌పన్ పాఠశాలలో శనివారం ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్ ఘనంగా నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మురళీధర్ రెడ్డి, ఇందులత, ప్రిన్సిపాల్ నీరజ్, లక్ష్మి, నవనీత తదితరులు పాల్గొన్నారు. – ఆల్విన్‌కాలనీ